# పెట్రోల్ కోసం పరుగులు!

- బంకుల వద్ద కిలోమీటర్ల మేర బారులు తీరిన వాహనాలు
- పుకార్లను నమ్మవద్దని అధికారుల విన్నపం



**నిజామాబాద్ , మార్చి 25 (ఇదే నిజం):**

తెలంగాణ రాష్ట్రంలో ఒక్కసారిగా పెట్రోల్.. డీజిల్ కొరత ఏర్పడిందనే వార్త కార్చిచ్చులా వ్యాపించడంతో వాహనదారులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. సోషల్ మీడియాలో వస్తున్న వివిధ పుకార్ల నేపథ్యంలో ఇంధనం దొరకదేమో అన్న భయంతో ప్రజలు పెట్రోల్ బంకుల వైపు పరుగులు తీస్తున్నారు. ప్రస్తుతానికి ప్రభుత్వం కానీ.. సంబంధిత అధికారులు కానీ అధికారికంగా ఎలాంటి కొరత ఉందని ప్రకటించలేదు. అయినప్పటికీ హైదరాబాద్‌లోని పలు ప్రధాన ప్రాంతాల్లో కొన్ని బంకుల వద్ద ఇప్పటికే "స్టాక్ లేదు" బోర్డులు దర్శనమివ్వడం కలకలం రేపుతోంది. స్టాక్ అందుబాటులో ఉన్న చోట వాహనాలు కిలోమీటర్ల మేర బారులు తీరాయి.

### పల్లెల్లోనూ అదే పరిస్థితి

ఈ ప్రభావం నగరాలకే పరిమితం కాకుండా పల్లె ప్రాంతాలకు కూడా పాకింది. గ్రామాల్లోని బంకుల వద్ద రైతులు తమ ట్రాక్టర్లకు.. యువత ద్విచక్ర వాహనాలకు.. కార్లకు ట్యాంక్ ఫుల్ చేయించుకోవడానికి గంటల తరబడి వేచి చూస్తున్నారు. భవిష్యత్తులో ఇబ్బందులు వస్తాయన్న భయంతో చాలామంది వాహనదారులు కేవలం ట్యాంకులను నింపుకోవడమే కాకుండా.. ప్లాస్టిక్ క్యాన్లు.. బాటిళ్లు.. పెద్ద పెద్ద డ్రమ్ములలో పెట్రోల్.. డీజిల్‌ను నింపుకొని వెళ్తున్నారు.

### నిల్వ చేసుకోవద్దు

అనవసరంగా భయాందోళన చెంది భారీగా ఇంధనాన్ని నిల్వ చేసుకోవద్దని నిపుణులు సూచిస్తున్నారు. సరఫరాలో చిన్నపాటి జాప్యం జరిగి ఉండవచ్చుని.. అంతేకానీ రాష్ట్రంలో నిల్వలు పూర్తిగా అయిపోయాయని వస్తున్న వార్తల్లో నిజం లేదని తెలుస్తోంది. పెట్రోల్ బంకుల వద్ద కనిపిస్తున్న ఈ అసాధారణ రద్దీ రాష్ట్రవ్యాప్తంగా ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

# రసాయనాలు వద్దు.. సహజమే ముద్దు!

- నాళేశ్వర్‌లో సహజ వ్యవసాయంపై అవగాహన సదస్సు
- రైతులకు మట్టి ఆరోగ్య కార్డుల పంపిణీ



**నిజామాబాద్ , మార్చి 25 (ఇదే నిజం):**

నవీపేట్ మండలంలోని నాళేశ్వర్ గ్రామంలో సహజ వ్యవసాయం ప్రాముఖ్యతపై రైతులకు అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రస్తుత జీవన విధానంలో రైతుల ఆదాయాన్ని పెంపొందించడంతో పాటు.. భూమి సారాన్ని కాపాడుకోవడానికి సహజ వ్యవసాయం ఎంతో కీలకమని అధికారులు వివరించారు. పెట్టుబడి ఖర్చు తగ్గించి.. రసాయన రహిత ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఉత్పత్తి చేయడమే లక్ష్యంగా రైతులందరూ ఈ పద్ధతి వైపు మొగ్గు చూపాలని కోరారు.

### మట్టి ఆరోగ్య కార్డుల అందజేత

నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్ (ఎన్ ఎం ఎన్ ఎఫ్) కింద నమోదు చేసుకున్న రైతులకు మట్టి ఆరోగ్య కార్డులను పంపిణీ చేశారు. అలాగే రైతులకు ప్రోత్సాహకంగా జూట్ బ్యాగులు.. నోట్‌బుక్స్.. పెన్నులు.. క్యాలెండర్లు.. క్యాప్స్ వంటి ఉపకరణాలను అందజేశారు.

ఈ సదస్సులో గ్రామ సర్పంచ్ అర్మూర్ లావణ్య.. మండల వ్యవసాయ అధికారి (ఎం ఏ ఓ) నవీన్ కుమార్.. వ్యవసాయ విస్తరణ అధికారి (ఏ ఈ ఓ) వసంత్.. రిసోర్స్ పర్సన్ రవీందర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వీరితో పాటు ఉప సర్పంచ్ శ్రీనివాస్.. మాజీ సర్పంచ్ నర్సింగ్ రావు.. మాజీ సొసైటీ చైర్మన్ మగ్గరి హన్మండ్లు.. మాజీ ఎం పీ టీ సీ లక్ష్మణ్.. యువ రైతులు ప్రవీణ్.. గణేష్.. సంజీవ్.. సంపత్.. పోతన్న.. కిషాన్.. లింగారెడ్డి.. శ్రీకాంత్.. నవీన్.. రాజు.. దశరథ్.. బోజారం తదితరులు పాల్గొన్నారు. భవిష్యత్తులో మరింత మంది రైతులు ఈ సహజ వ్యవసాయ విధానాన్ని అనుసరించాలని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# రామాయంపేట రోడ్డు విస్తరణకు మోక్షం!

**40 ఫీట్ల వెడల్పునకు వ్యాపారస్తుల లిఖితపూర్వక అంగీకారం**

**బాధితులను ఆదుకుంటామని పాలకవర్గం హామీ**



**రామాయంపేట, మార్చి 25 (ఇదే నిజం):**

రామాయంపేట పట్టణంలో రోడ్డు వెడల్పు పనులకు త్వరలోనే శ్రీకారం చుడతామని.. మున్సిపాలిటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని పాలకవర్గ సభ్యులు తెలిపారు. బుధవారం పట్టణంలోని ప్రధాన రహదారి విస్తరణ పనుల కోసం మార్కింగ్ నిర్వహించారు. మెదక్ చౌరస్తా నుంచి పోస్ట్ ఆఫీస్ వరకు 40 ఫీట్ల మేర రోడ్డు వెడల్పు చేసేందుకు మార్కింగ్ పనులు పూర్తి చేశారు.

### వ్యాపారస్తుల సహకారం

రోడ్డుకు ఇరువైపులా 40 ఫీట్ల వెడల్పు చేసేందుకు పలువురు వ్యాపారస్తులు అంగీకారం తెలిపారు. ఈ మేరకు వారు పాలకవర్గ సభ్యులకు లిఖితపూర్వకంగా హామీ ఇచ్చారు. స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన వ్యాపారస్తులకు పాలకవర్గం కృతజ్ఞతలు తెలిపింది. ఆస్తులు కోల్పోయిన వారిని ప్రభుత్వం తరఫున ఆదుకునేందుకు కృషి చేస్తామని.. ఎమ్మెల్యే రోహిత్ రావు.. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సహకారంతో బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

### తొలి విడత పనులు

మొదటి విడతలో రోడ్డు విస్తరణ పనులు రెండు మూడు రోజుల్లో ప్రారంభిస్తామని పాలకవర్గ సభ్యులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు గజవాడ నాగరాజు.. దేవుని రంజిత్.. పుట్టి సందీప్.. రవి నాయక్ పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చింతల స్వామి.. జిల్లా ఉపాధ్యక్షుడు దేమే యాదగిరి.. జిల్లా కార్యదర్శి పోచమ్మల గణేష్.. సీనియర్ నాయకులు దాకి స్వామి.. బోట్ల బాబు.. బైరం కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# పట్టపగలే దారుణం

**వృద్ధ దంపతులపై సుత్తితో దాడి చేసి బంగారం దోపిడీ**

**జంగరాయి గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తి ఘాతుకం**

**5 తులాల బంగారు ఆభరణాల అపహరణ**

**బాధితులకు మెదక్ ఆసుపత్రిలో చికిత్స**

**సంఘటన స్థలాన్ని పరిశీలించిన అదనపు ఎస్పీ మహేందర్**

**శంకరంపేట్ (ఆర్), మార్చి 25 (ఇదే నిజం):**

శంకరంపేట్ (ఆర్) పోలీస్ స్టేషన్ పరిధిలోని జంగరాయి గ్రామంలో బుధవారం మధ్యాహ్నం భయంకరమైన దోపిడీ ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు అంజయ్య.. సావిత్రి నివాసంలోకి గుర్తుతెలియని వ్యక్తి చొరబడ్డాడు. ఒంటరిగా ఉన్న వారిపై సుత్తితో విచక్షణారహితంగా దాడి చేశాడు. అనంతరం వారి వద్ద ఉన్న సుమారు 5 తులాల బంగారు ఆభరణాలను దోచుకుని బైక్‌పై పరారయ్యాడు.

### వైద్యం కోసం ఆసుపత్రికి తరలింపు

దుండగుడి దాడిలో తీవ్రంగా గాయపడిన అంజయ్య.. సావిత్రి దంపతులను స్థానికులు గమనించి వెంటనే మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారికి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. పట్టపగలే నివాస గృహంలోకి చొరబడి దాడికి పాల్పడటంతో గ్రామస్థులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.

### రంగంలోకి అదనపు ఎస్పీ

సమాచారం అందుకున్న మెదక్ జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ వెంటనే జంగరాయి గ్రామానికి చేరుకుని సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు సేకరించారు. నిందితుడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. క్లూస్ టీమ్ ద్వారా కీలక ఆధారాలను సేకరించామని.. త్వరలోనే నిందితుడిని అదుపులోకి తీసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ డీ ఎస్ పీ నరేందర్ గౌడ్.. సీ ఐ వెంకట రాజా గౌడ్.. ఎస్ ఐ నారాయణ గౌడ్ పాల్గొన్నారు.

# మెరిసిన రుత్విక్.. స్కూల్‌కు గర్వకారణం!

**సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో ఉమ్మడి జిల్లాలో 34వ ర్యాంకు**

**విద్యార్థిని అభినందించిన శ్రీ సాయి స్కూల్ యాజమాన్యం**




**నాగిరెడ్డిపేట, మార్చి 25 (ఇదే నిజం):**

కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలం గోపాల్ పెట్ గ్రామానికి చెందిన విద్యార్థి రుత్విక్ ఇటీవల జరిగిన నవోదయ, సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షల్లో అద్భుత ప్రతిభ కనబరిచాడు. సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా స్థాయిలో 34వ ర్యాంకు సాధించి ముందంజలో నిలిచాడు. తమ పాఠశాల విద్యార్థి సాధించిన ఈ విజయం గర్వకారణమని యాజమాన్యం ప్రతినిధి మహ్మద్ రఫీ తెలిపారు. ఉపాధ్యాయుల సరైన మార్గదర్శకత్వం, విద్యార్థి పట్టుదల వల్లే ఈ ఘనత సాధ్యమైందని కొనియాడారు. చదువుతో పాటు క్రమశిక్షణకు పెద్దపీట వేయడం వల్లే తమ పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి పాఠశాలలకు ఎంపికవుతున్నారని పేర్కొన్నారు.

# త్వరగా అందుబాటులోకి పోలీస్ పెట్రోల్ బంక్!

**పనులను పర్యవేక్షించిన అదనపు ఎస్పీ మహేందర్**

**నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆదేశం**



**మెదక్, మార్చి 25 (ఇదే నిజం):**

మెదక్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐ ఓ సీ) పెట్రోల్ బంక్ పనుల పురోగతిని జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ పరిశీలించారు. బుధవారం ఆవుసులపల్లి గ్రామ పరిధిలో నిర్మాణంలో ఉన్న బంక్ పనులను ఆయన స్వయంగా చూశారు. పనులను వేగవంతం చేసి ప్రజలకు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో నాణ్యత విషయంలో రాజీ పడకూడదని అదనపు ఎస్పీ సూచించారు. ప్రత్యేక దృష్టి సారించి నాణ్యమైన ప్రమాణాలతో నిర్మాణాన్ని పూర్తి చేయాలని తెలిపారు. అక్కడ ఉన్న పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన మౌలిక సదుపాయాలను సక్రమంగా ఏర్పాటు చేయాలని చెప్పారు. ఈ పెట్రోల్ బంక్ అందుబాటులోకి రావడం వల్ల స్థానిక ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ పర్యటనలో ఆయన వెంట ఏ ఆర్ డీ ఎస్ పీ రంగా నాయక్, ఆర్ ఎస్ ఐ మహిపాల్, ఇతర సిబ్బంది ఉన్నారు.

# హైందవ చైతన్యమే భారత సంక్షేమం!

**ఏప్రిల్ 14న ఇందూరులో భారీ హిందూ సమ్మేళనం**

**ఆహ్వాన పత్రికను ఆవిష్కరించిన నగర కార్యవహ అర్గుల సత్యం**



**నిజామాబాద్, మార్చి 25 (ఇదే నిజం):**

ఇందూరు నగరంలోని ఆర్ టీ సీ కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో హిందూ సమ్మేళనం ఆహ్వాన పత్రికను బుధవారం సాయంత్రం ఘనంగా ఆవిష్కరించారు. నగర కార్యవహ అర్గుల సత్యం ముఖ్య అతిథిగా హాజరై ఈ పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైందవ చైతన్యమే భారత సంక్షేమమని.. దేశాన్ని మళ్లీ విశ్వగురువుగా నిలపడానికి హిందూ సమాజం జాగృతం కావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

### ఏప్రిల్ 14న సమ్మేళనం

వచ్చే నెల ఏప్రిల్ 14 (మంగళవారం) నాడు శ్రీనివాసనగర్ కాలనీలోని హనుమాన్ మందిరం వద్ద ఈ హిందూ సమ్మేళనం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా కేదారనంద స్వామి.. పిట్లకృష్ణ మహరాజ్ హాజరుకానున్నారు. ముఖ్య అతిథిగా ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి విచ్చేయనున్నారు. ఈ పత్రికా ఆవిష్కరణ కార్యక్రమంలో నిర్వహణ కమిటీ అధ్యక్షులు పాలం శ్రీనివాస్.. ప్రధాన కార్యదర్శి కొల్లూరు అశోక్ కుమార్.. సభ్యులు రాజశేఖర్ రెడ్డి.. చిల్లా నవీన్.. నల్లా అశోక్.. ప్రవీణ్ రెడ్డి.. హనుమంతు రెడ్డి.. గణేష్.. విఠల్ సమన్ పాల్గొన్నారు. 14వ తేదీన జరిగే ఈ సమ్మేళనానికి భక్తులు.. హిందూ ధర్మ ప్రేమికులు అధిక సంఖ్యలో తరలిరావాలని కమిటీ కోరింది.

# క్షయపై పోరు.. యువత చొరవ!

**సకాలంలో గుర్తిస్తే టీబీ నివారణ సాధ్యం: డాక్టర్ శ్రీకాంత్**

**యువ సబర్మతి యూత్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం**



**గొల్లపెల్లి, మార్చి 25 (ఇదే నిజం):**

క్షయ వ్యాధిపై అవగాహన పెంచుకుంటేనే టీబీ రహిత సమాజం సాధ్యమని సుపరింటెండెంట్ డాక్టర్ శ్రీకాంత్ పేర్కొన్నారు. గొల్లపెల్లిలో యువ సబర్మతి యూత్.. ఆరోగ్య శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన టీబీ అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీబీ నివారణ పోస్టర్‌ను ఆవిష్కరించి.. ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాధి లక్షణాలు.. నివారణ పద్ధతులపై అవగాహన కల్పించారు. సకాలంలో పరీక్షలు చేయించుకుంటే క్షయను పూర్తిగా నియంత్రించవచ్చని.. ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన వివరించారు. యువత ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. స్కూల్ ప్రిన్సిపల్ అనిత మాట్లాడుతూ చిన్నతనం నుంచే ఆరోగ్యంపై అవగాహన ఉండాలని.. విద్యార్థులను చైతన్య పరిచిన యువతను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎల్పుల రాము.. బోడపట్ల రాజ్ కుమార్.. కాల్వ మధుకర్.. ఎనగందుల గణేష్.. తమ్మనవేని సంతోష్.. బక్కశెట్టి లవన్ పాల్గొన్నారు.

# బాలికల ఆరోగ్యమే ముఖ్యం!

**కే జీ బీ వీ లో కలెక్టర్ ప్రతిమా సింగ్ పర్యటన**

**వైద్య పరీక్షలు.. వంటశాల తనిఖీ**



**మెదక్ , మార్చి 25 (ఇదే నిజం):**

మెదక్ జిల్లా వెల్దుర్తి మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ సందర్శించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆర్ బీ ఎస్ కే క్యాంపును సందర్శించి.. బాలికలకు నిర్వహిస్తున్న వైద్య పరీక్షలను పరిశీలించారు. గైనకాలజీ వైద్యుల ద్వారా విద్యార్థినులకు చేపట్టిన పరీక్షల వివరాలను.. వారి ఆరోగ్య పరిస్థితులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి.. సరైన చికిత్స అందించేందుకు ఇటువంటి తనిఖీలు ఎంతో ఉపయోగపడతాయని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం పాఠశాలలోని మెనూ.. వంటశాల.. స్టోర్‌రూమ్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. భోజనం నాణ్యత.. పరిశుభ్రత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని సిబ్బందిని ఆదేశించారు. బాలికలకు నిత్యం పోషకాహారం అందేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు.. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# నిరుద్యోగులకు వరం.. స్వయం ఉపాధికి దరఖాస్తుల ఆహ్వానం!



**మెదక్, మార్చి 25 (ఇదే నిజం):**

మెదక్ జిల్లా షెడ్యూల్డు కులాల సేవా సహకార అభివృద్ధి సంఘం ద్వారా 2025-26 వార్షిక ప్రణాళిక కింద ఆర్థిక సహాయం పొందేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. సుమారు 236.60 లక్షల రూపాయల వ్యయంతో 249 మంది లబ్ధిదారులకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ప్రణాళిక రూపొందించినట్లు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పథకం కింద రవాణా రంగంలో 119 ఈవీ ద్విచక్ర వాహనాలు, 59 ఈవీ ఆటో రిక్షాలు, వ్యవసాయ రంగంలో 12 సోలార్ పంప్ సెట్లు, 59 నైపుణ్యాభివృద్ధి శిక్షణా యూనిట్లు కేటాయించినట్లు వివరించారు. యూనిట్ విలువను బట్టి 60 శాతం నుంచి 90 శాతం వరకు సబ్సిడీ అందజేస్తామని కలెక్టర్ ప్రతిమా సింగ్ స్పష్టం చేశారు. లక్ష రూపాయల లోపు యూనిట్లకు 90 శాతం, లక్ష నుంచి రెండు లక్షల వరకు 80 శాతం, రెండు నుంచి నాలుగు లక్షల వరకు 70 శాతం, నాలుగు లక్షల పైన ఉన్న వాటికి 60 శాతం సబ్సిడీ ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఏప్రిల్ 2వ తేదీలోపు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ డాట్ టీజీఓబీఎంఎంఎస్ డాట్ సీజీజీ డాట్ జీఓవీ డాట్ ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్లైన్ దరఖాస్తుతో పాటు హార్డ్ కాపీలను సంబంధిత మండల పరిషత్తు కార్యాలయం లేదా మున్సిపల్ కార్యాలయాల్లో సమర్పించాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల వారికి 1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల వారికి 2 లక్షల లోపు వార్షిక ఆదాయం ఉండాలని.. గత ఐదేళ్లలో ఎస్సీ కార్పొరేషన్ లబ్ధి పొందిన వారు అనర్హులని కలెక్టర్ స్పష్టం చేశారు. అభ్యర్థుల వయస్సు జూలై 1 నాటికి 21 నుంచి 50 ఏళ్ల మధ్య ఉండాలని.. వ్యవసాయ పథకాలకు 60 ఏళ్ల వరకు మినహాయింపు ఉంటుందని తెలిపారు. దరఖాస్తుదారులు ఆధార్ కార్డు, ఆదాయం, రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రాలతో పాటు అవసరమైన ఇతర పత్రాలను జత చేయాలని సూచించారు. జిల్లా స్థాయి కమిటీ ద్వారా లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరుగుతుందని కలెక్టర్ ప్రతిమా సింగ్ వివరించారు.





# భక్తిశ్రద్ధలతో గీతా వార్షికోత్సవం

- రామాయంపేటలో 32వ వార్షిక వేడుకలు.. ఘనంగా నగర సంకీర్తన



**రామాయంపేట, మార్చి 25 (ఇదే నిజం):**

రామాయంపేట పట్టణంలోని గీతా భవనంలో బుధవారం 32వ భగవద్గీత వార్షికోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. తెల్లవారుజామునే భక్తులు గీతా భవనానికి చేరుకొని భజనలు.. కీర్తనలతో నగర సంకీర్తన నిర్వహించారు. పట్టణ పురవీధుల్లో సాగిన ఈ ర్యాలీ భక్తి పారవశ్యాన్ని నింపింది. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా పురోహితులు దొర్బల కుమార శర్మ భగవద్గీత ప్రవచనం వినిపించారు. ప్రముఖ పండితులు దివంగత దొర్బల విశ్వనాథ శర్మ 30 ఏళ్లు ఈ పారాయణం చేయగా.. ప్రస్తుతం ఆయన కుమారుడు కుమార శర్మ గత రెండేళ్లుగా ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు.

ఈ సందర్భంగా భగవద్గీత సేవా సమితి ఆధ్వర్యంలో కుమార శర్మను శాలువాతో ఘనంగా సన్మానించారు. అలాగే మున్సిపల్ కౌన్సిలర్లు గజవాడ నాగరాజు గుప్తా.. పుట్టి సందీప్ తదితరులను కమిటీ సభ్యులు గౌరవించారు. ఈ కార్యక్రమంలో భగవద్గీత సేవా సమితి అధ్యక్షుడు కూర అంజయ్య.. ప్రధాన కార్యదర్శి టీ. చంద్రమౌళి.. సభ్యులు కృష్ణ హరి.. బల్ల రాజయ్య.. గబ్బుల వెంకటేశం.. గుండు సత్యనారాయణ.. ఆర్. ముత్యాలు.. తోట విటల్.. కైరం కొండ పెంటయ్య.. పోతన్న వెంకటేశం.. ఎనిశెట్టి లక్ష్మీపతి.. ఎనిశెట్టి వెంకటేశం.. దేవుని రాములు పాల్గొన్నారు.

# వైద్యుల భర్తీకి 'వాక్ ఇన్' ఇంటర్వ్యూ

**28న పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహణ**

**వివరాలు వెల్లడించిన సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్**



**పెద్దపల్లి, మార్చి 25 (ఇదే నిజం):**

పెద్దపల్లి జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న వైద్య పోస్టుల భర్తీకి ఈ నెల 28న (శనివారం) ఉదయం 11 గంటలకు వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కే. శ్రీధర్ తెలిపారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలోని ఆసుపత్రుల్లో గైనకాలజీ.. ఆప్తామాలజిస్ట్.. రేడియాలజీ.. ఆర్తోపెడిషియన్.. సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్ (ఎంబీబీఎస్) పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అర్హత.. ఆసక్తి గల అభ్యర్థులు తమ బయోడేటా.. విద్యార్హతల అసలు ధ్రువపత్రాలు.. ఒక సెట్ నకలు ప్రతులతో హాజరుకావాలని కోరారు. ఎంపికైన సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్టులకు నెలకు లక్ష రూపాయలు.. సివిల్ అసిస్టెంట్ సర్జన్లకు రూ. 52,351 వేతనం ఉంటుందని వివరించారు. ఇతర సమాచారం కోసం 8499061999.. 9492457809 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.



# సన్న బియ్యం సరఫరా సక్రమంగా ఉండాలి!

**ఎం ఎల్ ఎస్ పాయింట్‌లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ**

**రికార్డులు.. నిల్వలను పరిశీలించిన ప్రతిమా సింగ్**

**మెదక్, మార్చి 25 (ఇదే నిజం):** మెదక్ పట్టణంలోని మార్కెట్ యార్డ్ వద్ద ఉన్న ఎం ఎల్ ఎస్ పాయింట్‌ను జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలకు నాణ్యమైన సన్న బియ్యం సక్రమంగా సరఫరా కావాలని ఆదేశించారు. ఎం ఎల్ ఎస్ పాయింట్ పరిధిలోని రేషన్ షాపులకు పెండింగ్‌లో ఉన్న బియ్యాన్ని తక్షణమే పంపిణీ చేయాలని అధికారులకు సూచించారు. తనిఖీలో భాగంగా స్టాక్ రిజిస్టర్.. ఇష్యూ రిజిస్టర్.. గూడ్స్ రిజిస్టర్ వంటి రికార్డులను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. ఆన్‌లైన్ రికార్డులతో పాటు వెయింగ్ యంత్రాల రిసిప్ట్‌లను సరిచూశారు. గత మూడు నెలల బియ్యం సరఫరా తీరుపై అధికారులను ఆరా తీశారు. నిల్వల వివరాల్లో తేడాలు ఉండకూడదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ జగదీష్.. తహసీల్దార్ లక్ష్మణ్ బాబు.. ఇతర అధికారులు పాల్గొన్నారు.

# రోడ్డు నియమాలు పాటిద్దాం.. ప్రాణాలను కాపాడుకుందాం!

- పెద్దపల్లిలో 'అరైవ్-అలైవ్' ఫేజ్‌ఉ3.. వాహనదారులకు పోలీసుల అవగాహన



**పెద్దపల్లి, మార్చి 25 (ఇదే నిజం):**

రోడ్డు ప్రమాదాలను తగ్గించడం.. ప్రజల్లో భద్రతపై అవగాహన పెంచడం లక్ష్యంగా 'అరైవ్-అలైవ్' ఫేజ్‌ఉ3 కార్యక్రమం నిర్వహించారు. పెద్దపల్లి పట్టణంలోని బస్ స్టాండ్ జంక్షన్ వద్ద ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అనిల్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు వాహనదారులకు అవగాహన కల్పించారు. ప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరి బాధ్యత ఎంతో ముఖ్యమని అనిల్ కుమార్ పేర్కొన్నారు. వాహనదారులు.. ఆటో డ్రైవర్లు.. బైక్ రైడర్లు.. పాదచారులకు రోడ్డు నిబంధనలను ఆయన వివరించారు.

ముఖ్యంగా హెల్మెట్ ధరించడం.. సీటు బెల్టు పెట్టుకోవడం.. మద్యం సేవించి వాహనం నడపకూడదని సూచించారు. డ్రైవింగ్ చేసేటప్పుడు సెల్ ఫోన్ వాడటం ప్రాణాంతకమని హెచ్చరించారు. అధిక వేగంతో వెళ్లకూడదని.. ట్రాఫిక్ సిగ్నల్స్ పాటిస్తూ జీబ్రా క్రాసింగ్‌ల వద్ద పాదచారులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. నిబంధనలు పాటించడం ద్వారా మన ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా రక్షించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అనిల్ కుమార్.. ఎస్ ఐ రాజవర్ధన్.. ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లు పేదల హక్కు!

- అసెంబ్లీలో గళమెత్తిన విప్ విజయరమణ రావు
- ట్రాక్టర్లు ఉన్నవారికి బిల్లుల మినహాయింపు ఇవ్వాలని విజ్ఞప్తి

**పెద్దపల్లి, మార్చి 25 (ఇదే నిజం):**

పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని ప్రభుత్వ విప్.. పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు స్పష్టం చేశారు. బుధవారం తెలంగాణ అసెంబ్లీలో ఇందిరమ్మ ఇళ్ల అంశంపై ఆయన ప్రసంగించారు. 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ హయాంలో ఎందరో పేద.. మధ్యతరగతి కుటుంబాలకు గూడు కల్పించామని గుర్తుచేశారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో గత బీ ఆర్ ఎస్ ప్రభుత్వం పదేళ్లపాటు ప్రజలను మభ్యపెట్టి మోసం చేసిందని మండిపడ్డారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రస్తుత ప్రభుత్వం తొలి విడతగా ఐదు లక్షల ఇళ్లను మంజూరు చేసిందని.. ఇందులో ఇప్పటికే నాలుగున్నర లక్షల ఇళ్ల పనులు వివిధ దశల్లో ప్రగతిలో ఉన్నాయని తెలిపారు. అయితే గతంలో కేవలం సిమెంటు పొందిన వారు.. ఉపాధి కోసం ట్రాక్టర్లు వాడుతున్న వారు బిల్లుల చెల్లింపులో సాంకేతిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ఉపాధి కోసం ట్రాక్టర్లు కలిగిన పేద.. మధ్యతరగతి కుటుంబాలకు బిల్లుల చెల్లింపులో మినహాయింపు ఇవ్వాలని కోరారు. నిబంధనలను సవరించి లబ్ధిదారులకు న్యాయం చేయాలని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ ద్వారా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి.. ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.



# వెలుగుల జిలుగుల్లో నల్లగండ్ల హుడా కాలనీ!

- రూ.2 కోట్లతో సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు
- ప్రారంభించిన పీ ఏ సీ చైర్మన్.. ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ



**శేరిలింగంపల్లి, మార్చి 25 (ఇదే నిజం):**

గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నల్లగండ్ల హుడా కాలనీలో రూ.2 కోట్ల అంచనా వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ (విభజన వీధి దీపాలను) పీ ఏ సీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ప్రారంభించారు. మాజీ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డితో కలిసి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని.. స్విచ్ ఆన్ చేసి ఈ వెలుగులను ఆవిష్కరించారు.

**సురక్షిత ప్రయాణం.. కాలనీకి కొత్త శోభ**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. కాలనీలో భారీ వ్యయంతో అత్యాధునిక లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవడం సంతోషకరమన్నారు. ఈ వీధి దీపాల వల్ల కాలనీ వాసులకు.. వాహనదారులకు రాత్రి వేళల్లో ఎటువంటి ఇబ్బందులు కలగవని.. ప్రయాణం సాఫీగా సాగుతుందని తెలిపారు. నూతన లైటింగ్ వ్యవస్థ ఏర్పాటుతో హుడా కాలనీ కొత్త శోభను సంతరించుకుందని ఆయన పేర్కొన్నారు. అభివృద్ధి పనుల పట్ల కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు.. కాలనీ అసోసియేషన్ సభ్యులు.. నివాసితులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 'డీపీఎల్' ట్రోఫీ హవేళీఘన్‌పూర్ కైవసం

- ప్రగతి ధర్మారంలో ముగిసిన క్రికెట్ మెగా లీగ్
- విజేతలకు నగదు బహుమతులు అందజేసిన నాయకులు
- 15 రోజుల పాటు సాగిన క్రీడా సంబరం




**రామాయంపేట, మార్చి 25 (ఇదే నిజం):**

రామాయంపేట మండలం ప్రగతి ధర్మారంలో గత 15 రోజులుగా సాగుతున్న డీ పీ ఎల్ క్రికెట్ మెగా లీగ్ పోటీలు బుధవారం ఘనంగా ముగిశాయి. మండల స్థాయిలోని మొత్తం 52 జట్లు పాల్గొన్న ఈ టోర్నీలో క్రీడాకారులు ఉత్సాహంగా తలపడ్డారు. ఫైనల్ పోరులో హవేళీఘన్‌పూర్.. భీమ్‌రావుపల్లి జట్లు తలపడగా.. హవేళీఘన్‌పూర్ జట్టు అద్భుత ప్రదర్శనతో విజేతగా నిలిచి ట్రోఫీని కైవసం చేసుకుంది. రన్నరప్ స్థానంతో భీమ్‌రావుపల్లి జట్టు సరిపెట్టుకుంది. ఈ టోర్నీ విజేతలకు బహుమతుల ప్రధానోత్సవంలో స్పాన్సర్లు బీ ఆర్ ఎస్ నాయకులు బూరె శ్రీశైలం.. గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాసాయిపేట మల్లేశం.. గొల్ల రవి పాల్గొన్నారు. ప్రథమ విజేతకు రూ.25,000.. రన్నరప్‌కు రూ.15,000 నగదు బహుమతితో పాటు విజేత ట్రోఫీలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లోని నైపుణ్యాన్ని వెలికితీయడానికి ఇలాంటి పోటీలు దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ మెగా లీగ్‌ను విజయవంతంగా నిర్వహించిన ఆర్గనైజర్లు రాకేష్.. నరేష్.. సురేష్.. సలీంలతో పాటు సహకరించిన వారిని స్పాన్సర్లు.. గ్రామస్తులు అభినందించారు. 15 రోజుల పాటు సాగిన ఈ క్రీడా సంబరంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

# రామాయంపేట నియోజకవర్గ పోరు!

- అఖిలపక్షం ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి
- అంజయ్య ఇలాకాకు పూర్వవైభవం తేవాలని డిమాండ్



**రామాయంపేట, మార్చి 25 (ఇదే నిజం):**

రామాయంపేటను తిరిగి అసెంబ్లీ నియోజకవర్గంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ నియోజకవర్గ సాధన సమితి ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ రజని కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. 1956లో ప్రత్యేక నియోజకవర్గంగా ఉండి.. టంగుటూరి అంజయ్య వంటి ముఖ్యమంత్రిని అందించిన ఘనచరిత్ర ఈ గడ్డకు ఉందని నాయకులు గుర్తుచేశారు. 2008 డీలిమిటేషన్‌లో నియోజకవర్గం రద్దు కావడంతో అభివృద్ధి కుంటుపడిందని.. విద్యా.. వైద్య.. ఉపాధి రంగాల్లో వెనుకబాటుతనం కనిపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రామాయంపేట భౌగోళికంగా.. జనాభా పరంగా అన్ని అర్హతలు కలిగి ఉందని వివరించారు. నియోజకవర్గ హోదా కోసం దశలవారీగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పార్టీలకు అతీతంగా అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సాధన సమితి సభ్యులు రాగి రాములు.. చౌదరి సుప్రభాత్ రావు.. టీ యూ డబ్ల్యూ జే ఐ జే యూ రాష్ట్ర నాయకులు డీ జీ శ్రీనివాస్ శర్మ.. సీ ఐ టీ యూ నాయకురాలు బాలమణి.. బీజేపీ మండల అధ్యక్షుడు శీలం అవినాష్ రెడ్డి.. అక్కన్నపేట సర్పంచ్ బక్కయ్య గారి యాదగిరి.. లక్ష్మాపూర్ సర్పంచ్ నవీన్ గౌడ్.. ఎమ్మార్పీఎస్ నాయకులు పాతూరి రాజు.. బీసీ సంక్షేమ సంఘం నాయకులు గంగారం.. వెలుముల సిద్ధరాములు.. నిజాంపేట మండలానికి చెందిన ఆకుల రమేష్ పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ సాగు పెరగాలి!

- ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై కలెక్టర్ శ్రీ హర్ష తనిఖీ
- పని పూర్తి చేస్తేనే వెంటనే బిల్లుల చెల్లింపు



**పెద్దపల్లి, మార్చి 25 (ఇదే నిజం):**

జిల్లాలో ఆయిల్ పామ్ పంట సాగును భారీగా విస్తరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులను ఆదేశించారు. బుధవారం సుల్తానాబాద్ మండలం బొంతకుంటపల్లి గ్రామంలో పర్యటించిన ఆయన.. అక్కడి ఆయిల్ పామ్ తోటలను, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. 30 ఎకరాల్లో సాగవుతున్న ఆయిల్ పామ్ తోటతో పాటు నాలుగు ఎకరాల్లో అంతర్ పంటగా వేసిన కోకో సాగును చూసి.. దిగుబడి ఎప్పటికి అందుబాటులోకి వస్తుందో ఆరా తీశారు. సుల్తానాబాద్ మండలంలో ప్రస్తుతం 350 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు జరుగుతోందని.. జూన్ నెల నుంచి కొన్ని చోట్ల కోతలు ప్రారంభమవుతాయని వెల్లడించారు. ఈ పంట ద్వారా వచ్చే ఆదాయంపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు.

అనంతరం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతిని పరిశీలిస్తూ.. పనులు జరిగిన తీరును బట్టే బిల్లుల చెల్లింపు ఉంటుందని స్పష్టం చేశారు. గ్రామంలో ఆసరి రమ్య అనే లబ్ధిదారురాలు నిర్మిస్తున్న ఇంటిని చూసి.. ఇప్పటివరకు మూడు లక్షల నలభై వేల రూపాయలు విడుదలయ్యాయని.. మిగిలిన పనులు 15 రోజుల్లో పూర్తి చేస్తే ఫైనల్ బిల్లు చెల్లిస్తామని తెలిపారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట జిల్లా హార్టికల్చర్ సెరికల్చర్ అధికారి జగన్ మోహన్ రెడ్డి, ఎంపీ డీ ఓ దివ్య దర్శన్ రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# వేంకటేశ్వరుని సేవలో కటారి

**భక్తిశ్రద్ధలతో వెనుగుమట్ల-బొంకూర్ జాతర**



**గొల్లపల్లి, మార్చి 25 (ఇదే నిజం):**

జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం వెనుగుమట్లఉబొంకూర్ గ్రామాల్లో శ్రీ వేంకటేశ్వర స్వామి జాతర అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వేడుకల్లో జిల్లా సీనియర్ నాయకులు కటారి చంద్రశేఖర్ రావు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితుల ఆశీర్వచనాల మధ్య తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు నక్క స్రవంతి-జమలకర్, ముల్కల శ్రీనివాస్, జక్కుల పావని-దస్తగిరి, ఉప సర్పంచులు దొనకొండ గంగాధర్, స్వామి గౌడ్, ఆలయ కమిటీ చైర్మన్ ఎల్లాల గోపాలరెడ్డి, గ్రామ పెద్దలు ప్రభాకర్ రెడ్డి, కనపర్తి శ్రీనివాస్ రావు, మాదాసు గంగారాం, మనోహర్ రావు, కాంగ్రెస్ నాయకులు కిష్టంపేట రమేష్ రెడ్డి, రఘుపతి గౌడ్, తిరుపతి, నవీన్ పాల్గొన్నారు.

# బస్తీ బాటతో సమస్యలకు చెక్!

**ఎస్ సీ కాలనీలో మున్సిపల్ పాలకవర్గం పర్యటన**

**తాగునీరు.. రోడ్ల సమస్యల పరిష్కారానికి హామీ**



**రామాయంపేట, మార్చి 25 (ఇదే నిజం):**

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రామాయంపేట మున్సిపల్ పాలకవర్గం బుధవారం ఒకటో వార్డు ఎస్ సీ కాలనీలో 'బస్తీ బాట' కార్యక్రమం నిర్వహించింది. ప్రతి వీధిని సందర్శించి ప్రజల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా సీ సీ రోడ్లు.. కొత్త డ్రైనేజీ వ్యవస్థ.. తాగునీటి కొరత.. విద్యుత్ సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వేసవి ఎండలను దృష్టిలో ఉంచుకుని నీటి ఎద్దడి తలెత్తకుండా వివిధ వార్డుల్లో కొత్త బోరుబావుల తవ్వకాలు చేపడతామని పాలకవర్గ సభ్యులు వెల్లడించారు. కాలనీలో పేరుకుపోయిన మురుగును వెంటనే శుభ్రం చేయించారు. సొంత ఇల్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందేలా చూస్తామని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే రోహిత్ రావు.. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సహకారంతో పెండింగ్ పనులను పూర్తి చేస్తామని కౌన్సిలర్ గజవాడ నాగరాజు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు దేవుని రంజిత్.. పుట్టి సందీప్.. రవి నాయక్.. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చింతల స్వామి.. జిల్లా ఉపాధ్యక్షుడు దేమే యాదగిరి.. నాయకులు చింతల యాదగిరి.. బుర్ర అనిల్ కుమార్.. దాకి స్వామి.. బోట్ల బాబు.. బైరం కుమార్ పాల్గొన్నారు.

# గ్యాస్ కష్టాలపై స్పష్టత ఏది?

**ప్రభుత్వాల తీరుపై బీ ఆర్ ఎస్ నాయకుడు సంతోష్ కుమార్ ఆగ్రహం**

**స్వార్థ రాజకీయాల కోసం ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని విమర్శ**

**గొల్లపల్లి, మార్చి 25 (ఇదే నిజం):**




గత కొన్ని రోజులుగా ఎదురవుతున్న గ్యాస్ కొరత సమస్యపై కేంద్ర.. రాష్ట్ర ప్రభుత్వాలు స్పష్టత ఇవ్వకపోవడం దురదృష్టకరమని బీ ఆర్ ఎస్ నాయకుడు టీ. సంతోష్ కుమార్ మండిపడ్డారు. గొల్లపల్లిలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వాల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం గ్యాస్ కొరత లేదని చెబుతుంటే.. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఉందని అంటోందని.. ఈ పొంతన లేని మాటలతో ప్రజలను అయోమయంలోకి నెడుతున్నారని విమర్శించారు. ప్రభుత్వాలు తమ స్వార్థ రాజకీయాల కోసం ప్రజల అవసరాలతో ఆడుకుంటున్నాయని సంతోష్ కుమార్ ఆరోపించారు. గ్యాస్ విషయంతో పాటు ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల విషయంలోనూ ప్రజలను మభ్యపెడుతున్నారని ధ్వజమెత్తారు. ప్రజల ఇబ్బందులను పట్టించుకోకుండా కాలయాపన చేస్తే.. రానున్న రోజుల్లో ప్రజలే ప్రభుత్వాలకు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు బీ ఆర్ ఎస్ నాయకులు.. కార్యకర్తలు పాల్గొన్నారు.

# వరకట్న వేధింపులకు 'మమత' బలి

**అదనపు కట్నం కోసం అత్తింటి వేధింపులు**

**దొంగల ధర్మారంలో విషాదం**

**రామాయంపేట, మార్చి 25 (ఇదే నిజం):**



మెదక్ జిల్లా రామాయంపేట మండలం దొంగల ధర్మారం గ్రామంలో వరకట్న వేధింపులకు తట్టుకోలేక వడ్ల మమత (24) అనే వివాహిత ఆత్మహత్య చేసుకుంది. బాధితురాలి తండ్రి వడ్ల బ్రహ్మాచారి తెలిపిన వివరాల ప్రకారం.. రాయపోలు మండలం రామవరం గ్రామానికి చెందిన వడ్ల నరసింహచారితో 2023లో మమతకు వివాహం జరిగింది. పెళ్లి సమయంలో లక్ష రూపాయల నగదు.. తులంన్నర బంగారం కట్నంగా ఇచ్చారు. అయినప్పటికీ అదనపు కట్నం తేవాలంటూ భర్త నరసింహచారి.. మామ శ్రీనివాసచారి.. అత్త పుష్ప.. ఆడపడుచు బాలలక్ష్మి వేధించేవారని ఆరోపించారు. గతంలో పెద్దల సమక్షంలో పంచాయతీ నిర్వహించి మమతను అత్తింటికి పంపించినా వారి తీరు మారలేదు. 15 రోజుల క్రితం కూడా అదనపు కట్నం ఇస్తామని చెప్పి పంపినా.. అదే రోజు మళ్లీ వేధించి ఇంటికి పంపారని తండ్రి ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన మమత గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ప్రాణాలు విడిచింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

